ప్రజాశక్తి

గురువారం 14 మార్చి 2024

5

శ్రీకాకుళం



ఆన్‌లైన్ నేరాలపై అప్రమత్తం

శ్రీకాకుళం అర్బన్ : ఆన్‌లైన్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. అవగాహనతోనే నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. ఈ నెల 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా) సంస్థ డాక్టర్ డిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో నిర్వహించనున్న 'సైబర్ నేరాలు- తీసుకోవాల్సిన జాగ్రత్తలు' సదస్సు వాల్‌పోస్టరు, కరపత్రాలను కలెక్టరేట్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఇంటర్‌నెట్ అధికంగా వినియోగంలోకి వచ్చాక దాని ద్వారా ఎందరో సైబర్ మోసగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని జెసి తెలిపారు. విద్యార్థులు కూడా మొబైల్ ఫోన్లు ఎక్కువగా వినియోగిస్తున్నారని, కంప్యూటర్ గేమ్స్ ఆడుతూ మోసగాళ్ల వలలో చిక్కుకునే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రా జిల్లా అధ్యక్షులు గంజి ఎజ్రా, రవికుమార్, కట్టా పార్థసారథి పాల్గొన్నారు.

బిజెపి దేశానికి వినాశకరం

- రైతు, కార్మిక హక్కులను కాలరాస్తోంది
- ఉద్దానం ప్రాంతానికి చాలా అన్యాయం చేస్తున్నారు
- తరుణాచారి స్ఫూర్తితో పోరాడాల్సిన తరుణమిదే
- సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి మధు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి, సోంపేట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి.మధు ఆందోళన వ్యక్తంచేశారు. సోంపేట మండలం మామిడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన తొలి తరం కమ్యూనిస్టు నేత గానుగుల తరుణాచారి స్మారక స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రైతులు, కార్మికుల హక్కులను బిజెపి కాలరాస్తోందని మండిపడ్డారు. అడవులను కార్పొరేట్లకు అప్పగిస్తూ, అటవీ హక్కు చట్టానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని చెప్పారు. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పార్కు ఏర్పాటు కలగానే మిగిలిందన్నారు. తిత్లీ తుపాను ప్రభావంతో కొబ్బరి దిగుబడి తగ్గిందని, సరైన గిట్టుబాటు ధర కూడా రావడం లేదని చెప్పారు. జీడి పిక్కలకు మద్దతుధర ఇవ్వాలని రైతులు అడుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కిడ్నీ వ్యాధులకు సరైన పరిష్కారం చూపించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. పలాసలో పేరుకే సూపర్ స్పెషాలిటీ, రీసెర్చ్ ఆసుపత్రి పెట్టారని, అందులో సిబ్బంది లేరని, పరికరాలూ లేవని విమర్శించారు. కిడ్నీ వ్యాధులు రాకుండా చేసే విధానాలతోపాటు వచ్చిన తర్వాత నయం చేసే చర్యలను ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సరైన తాగు నీరు అందివ్వలేకపోవడం వల్లే సగం వ్యాధులు ప్రబలుతున్నాయని, కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు రక్షిత మంచినీటిని అందించాలని డిమాండ్‌చేశారు. జిల్లాలో తొలి తరం కమ్యూనిస్టు నేతగా ఉన్న గానుగుల తరుణాచారి తన యావత్తు జీవితాన్ని ప్రజల కోసం త్యాగం చేశారని కొనియాడారు. ఉద్దానం ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై తరుణాచారి స్ఫూర్తితో పోరాటానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానికులకు ఉపయోగపడేలా ఇక్కడి విజ్ఞాన కేంద్రాన్ని తయారు చేయాలని ఆయన సూచించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ తొలి తరం కమ్యూనిస్టు నేత తరుణాచారి స్వాతంత్య్రోద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారని చెప్పారు. ఈ ప్రాంతంలో చీపి, పైడిగాం, హంస ర్యాలీ ప్రాజెక్టు నిర్మాణం చేయాలని అనేక ఉద్యమాలు నిర్మించారని గుర్తుచేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహన్‌రావు మాట్లాడుతూ నేరడి వద్ద బ్యారేజీ నిర్మించి వంశధార నీటిని ఇచ్ఛాపురం వరకు అందించాలన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

సభకు అధ్యక్షత వహించిన గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు జుత్తు సింహాచలం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం రాక మునుపే ఈ ప్రాంతంలో ఉద్యమాన్ని నడిపిన మహనీయుడు తరుణాచారి అని కొనియాడారు. 1930లో రైతు రక్షణ యాత్రలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. విజ్ఞాన కేంద్రం చైర్మన్ పాతిన కృష్ణమూర్తి మాట్లాడుతూ తరుణాచారి జీవిత చరిత్ర, ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి చెప్పే లక్ష్యంతోనే విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశామన్నారు

సిపిఎం మండల కన్వీనర్ సంగారు లక్ష్మీనారాయణ, నాయకులు తెప్పల పాపారావు, కర్రి సింహాచలం. వివిధ రైతు, ప్రజాసంఘాల నాయకులు ఎం లోకనాథం, గొరకల లింగరాజు, ఎల్.బాబూరావు, డి.నేతాజి, ఎస్.దివాకర్, శేషగిరిరావు, కుసుమ, టి.అజయ్‌కుమార్, మార్కండేయులు, నిర్మల, గణపతి, దేవేంద్ర, బి.వాసు, ఎంపిటిసి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ర్యాలీ

మామిడిపల్లి గ్రామ కూడలి వద్ద తొలుత కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి పి మధు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, ప్రజా నాట్య మండలి కళాకారుల పాటలతో సభా వేదికైన గానుగుల తరుణాచారి విజ్ఞాన కేంద్రానికి ర్యాలీగా బయల్దేరారు. విజ్ఞాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్థూపాన్ని ఆయన ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి కళాకారులు ఎస్.చంద్రయ్య, టి.వైకుంఠరావు, మూల రామారావు తదితరుల బృందం పలు అభ్యుదయ గీతాలను ఆలపించింది.



డెయిరీలో పాలు సేకరిస్తున్న నిర్వాహకులు (ఫైల్)

అసలే అంతంత మాత్రం ఆదాయంతో నడుస్తున్న పాల సేకరణ కేంద్రాలపై లైసెన్సు గుదిబండ పడింది. వెన్నశాతం తనిఖీకి ఉపయోగించే అనలైజర్‌కు అనుమతిని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అనుమతి మంజూరు కోసం ఒక్కో కేంద్రం నిర్వాహకుని నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేయనుంది. ఈ మేరకు ఇప్పటికే పశు సంవర్ధక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఏటా లైసెన్సును పునరుద్ధరించుకోవాలని అందులో పేర్కొంది. పాలసేకరణ కేంద్రాలపై గుదిబండగా మారిన ఈ నిర్ణయంపై నిర్వాహకులు మండిపడుతున్నారు.

పాల సేకరణ కేంద్రాలపై లైసెన్స్ గుదిబండ

- వెన్నశాతం గుర్తింపు అనలైజర్లకు అనుమతి తప్పనిసరి
- కేంద్రాల నిర్వాహకులకు పశుసంవర్ధక శాఖ ఆదేశం
- లైసెన్స్ పొందాలంటే రూ.వెయ్యి రుసుం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

పాలల్లో వెన్న శాతం లెక్కించే మిల్క్ అనలైజర్ యంత్రాలకు అనుమతి (లైసెన్సు) తీసుకోవాలని గ్రామాల్లోని పాలసేకరణ కేంద్రాల నిర్వాహకులకు పశు సంవర్ధక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల అమల్లోకి వచ్చిన పాలచట్టం -2023ను అనుసరించి లైసెన్సు కోసం ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుతోపాటు రూ.వెయ్యి రుసుంగా చెల్లించాలని నిర్దేశించింది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ అధికారులు.. పాలసేకరణ కేంద్రాల నిర్వాహకులకు లిఖిత పూర్వకంగా నోటీసులు అందజేశారు. జిల్లాలో 769 పాలసేకరణ కేంద్రాలు ఉన్నాయి. అందులో 191 కేంద్రాల నిర్వాహకులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పాల సేకరణ కేంద్రాల్లో పాలల్లో వెన్న శాతాన్ని బట్టి నిర్వాహకులు రైతులకు ధర చెల్లిస్తారు. ఈ పద్ధతి ఎన్నోఏళ్ల కాలం నుంచి కొనసాగుతోంది. వెన్న శాతం తక్కువగా నమోదైతే రైతు నష్టపోయే అవకాశం ఉంటుంది. అందువల్ల కేంద్రాల్లో వినియోగించే మిల్క్ అనలైజర్లు సక్రమమైనవేనని పశు సంవర్ధక శాఖ నిర్ధారించాల్సి ఉంటుందని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనలైజర్‌ను నేరుగా పరిశీలించాకే సరైనదని ధృవీకరించి పత్రం జారీ చేస్తారు. ప్రతి ఏటా ఈ లైసెన్సు క్రమబద్ధీకరించుకోవడం తప్పనిసరి.

నిర్వాహకుల విస్మయం

ఎన్నో ఏళ్లుగా ఈకేంద్రాలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు కొత్తగా లైసెన్సు విధానం ప్రవేశ పెట్టడంతో వారిలో ఆయోమయం నెలకొంది. కేంద్రం నిర్వహణ వల్ల పెద్దగా ఆదాయం లేకపోయినా లైసెన్సు ఫీజు కింద రూ.వెయ్యి తీసుకుంటున్నారని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 769 కేంద్రాల ద్వారా రోజుకు సుమారు 4.50లక్షల లీటర్ల వరకు పాల సేకరణ జరుగుతోందని అంచనా. గ్రామాల్లో నిరుద్యోగ యువత, గృహిణులు స్వయం ఉపాధి కోసం స్వల్ప పెట్టుబడులతో నిర్వహిస్తున్న కేంద్రాలపై ఇప్పుడు లైసెన్సు పేరుతో ఒత్తిడి తేవడాన్ని వారు తప్పుపడుతున్నారు. జిల్లాలో 769 కేంద్రాల నుంచి ఏడాదికి రూ.7.69 లక్షల వరకు లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

రైతులకు మేలు

పాల చట్టం - 2023 ప్రకారం వెన్న శాతం కొలిచే పరికరాలకు లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుంది. పాలలో వెన్న శాతాన్ని కొలవడంలో నాణ్యత ఉంటుందని ప్రభుత్వ ఉద్దేశం. ఈ లైసెన్సులు పొందిన వారు కచ్చితమైన అనలైజర్లను మాత్రమే ఉపయోగిస్తారు. రైతులకు మంచి ధర చెల్లిస్తారు.

- దాక్టరు కిశోర్, పశుసంవర్ధక శాఖ జెడి



ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అభివృద్ధి, సంక్షేమ పాలనే లక్ష్యం

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి-పొందూరు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం పొందూరు మండలంలోని పలు గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కేశవదాసుపురంలో రహదారి నిర్మాణాన్ని ప్రారంభించారు. పొందూరు, పిల్లలవలసలలో నాడు-నేడులో భాగంగా చేపట్టిన హైస్కూల్ భవనం, రాపాకలో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాల భవనాలను ప్రారంభించారు. దల్లవలసలో ఆర్‌బికె, గోకర్ణపల్లిలో సిసి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆమదాలవలస మండలంలోని తోటాడ గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యదర్శి బండారు జైప్రతాప్‌కుమార్, జెసిఎస్ మండల కన్వీనర్ బాడాన వెంకటకృష్ణారావు, వైస్ ఎంపిపి వండాన వెంకటరావు, సర్పంచులు మజ్జి శైలజ, మొకర శంకరరావు, కొంచాడ గిరిబాబు, కిల్లాన జ్యోతి, చింతాడ మాధురి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎస్‌పిలతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్, ఎస్‌పి జి.ఆర్.రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హింసకు తావు లేకుండా, రీపోలింగ్ జరిగే అవకాశం ఇవ్వకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖేష్ కుమార్ మీనా.. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలకు సూచించారు. జిల్లా నుంచి కలెక్టర్ మనజిర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయనకు నివేదించారు. ఎన్నికల నిర్వహణకు మానవ వనరులు, సామగ్రి, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మ్యాపింగ్, సి విజిల్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమ్యూనికేషన్ ప్లాన్, తదితర అంశాలలో సర్వ సన్నద్ధంగా ఉన్నామని వివరించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అన్ని రకాల దరఖాస్తులు 2956 పరిష్కరించాల్సి ఉందన్నారు. గత వారం రోజుల్లోనే 1845 కొత్త దరఖాస్తులు వచ్చాయన్నారు. కొత్తగా 2,82,688 ఓటరు కార్డులకు గాను 2.55 లక్షలు కార్డులు చేరుకున్నాయని తెలిపారు. వీటిలో 1,91,978 కార్డులను పోస్టల్ శాఖ ద్వారా డిస్పాచ్ చేశామన్నారు. రానున్న మూడు రోజుల్లో వంద శాతం పంపిణీ చేయడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి ప్రేమ కాజల్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, డ్వామా పీడీ చిట్టి రాజు, పలువురు నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ మనజిర్, జెసి నవీన్, ఎస్‌పి రాధిక, తదితరులు

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం : డిఆర్‌ఒ

జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సూక్ష్మపరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో సూక్ష్మపరిశీలకులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మపరిశీలకులకు ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారని, ఎపిక్ కార్డును లీడ్ బ్యాంకు మేనేజరుకు అందజేయాలని సూచించారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను ఎన్నికల కమిషన్ అందుబాటులో ఉంచిందని, అందరూ వివరాలు అప్‌లోడ్ చేసి ఎపిక్ కార్డు పొందాలని సూచించారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వికలాంగులు ఈ ఎన్నికలలో ఓటు హక్కును ఇంటి నుంచి వినియోగించుకునేందుకు వీలు కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజు సూక్ష్మ పరిశీలకుల విధి విధానాలను ఆయన వివరించారు. పోస్టల్ బ్యాలెట్‌పై పలు అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిసిఒ ఎన్.బాలరాజు, శేషగిరి, ఎల్‌డిఎం సూర్యకిరణ్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సన్నద్ధతపై అభ్యంతరాలు తెలపండి

జిల్లాలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సమస్యను నేరుగా జిల్లా ఎన్నికల యంత్రాంగానికి తెలియజేయాలని కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్.. రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. అనుబంధ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, రానున్న ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో మార్పులు, చేర్పులు కోరుతూ 2295 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. కౌంటింగ్ కేంద్రంగా ఎచ్చెర్లలోని శివాని ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేశామన్నారు. పోలింగ్ కోసం సిబ్బందికి ఇప్పటికే పలు దశల్లో శిక్షణ పూర్తి చేశామన్నారు.

సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు సిహెచ్ రంగయ్య, భరత్ నాయక్, రాజకీయ పార్టీ ప్రతినిధులు రౌతు శంకరరావు, పి.ఎం.జె.బాబు, సురేష్‌బాబు సింగ్, డి.మల్లిబాబు, లాస సోమేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి ఇఒ రమేష్‌బాబు బదిలీ

కొత్త ఇఒగా చంద్రశేఖర్ నియామకం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా పనిచేస్తున్న డిఎల్‌వి రమేష్‌బాబు ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నవరం దేవస్థానంలో డిఇఒగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎన్.చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. రమేష్‌బాబు గత నెలలో రథసప్తమి వేడుకల సమయంలోనే నియమితులయ్యారు. దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తనకు ఆత్మీయులుగా చెప్పుకునే రమేష్‌బాబు.. దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ స్థాయిలో అరసవల్లిలో బాధ్యతలు చేపట్టారు. అయితే రథసప్తమి వేడుకల్లో ప్రోటోకాల్ ఉల్లంఘన, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మతోపాటు అర్చకుల పట్ల ఆయన అనుసరించిన వైఖరి వివాదాస్పదంగా మారింది. ఈ పంచాయితీ రెవెన్యూ మంత్రి ధర్మాన వద్దకు పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి తీసుకెళ్లినట్టు చెపుతున్నారు. ప్రస్తుతం ఆలయంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వివాదాస్పద వ్యక్తి ఇఒగా ఉంటే ఇబ్బందులు తప్పవని భావించిన మంత్రి ధర్మాన దేవాదాయశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రమేష్‌బాబును ఇక్కడి నుంచి వెనక్కి పంపించినట్టు ఆలయ సిబ్బంది చెపుతున్నారు. 35 రోజులపాటు ఇఒగా విధులు నిర్వర్తించిన ఆయనను ఆకస్మికంగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో చంద్రశేఖర్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

పలాసలో అభివృద్ధి శూన్యం

ఎంపీ కింజరాపు రామ్మోహనాయుడు



కాలిబాట వంతెనను ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహనాయుడు

ప్రజాశక్తి-పలాస

మంత్రి సీదిరి అప్పలరాజు దోచుకునేందుకే శ్రద్ధ చూపారే తప్ప పలాస అభివృద్ధి కోసం కృషి చేయలేదని ఎంపీ కింజరాపు రామ్మోహనాయుడు విమర్శించారు. కాశీబుగ్గ డెంకివీధిలో బుధవారం వైసిపి నుంచి సుమారు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటికి ప్రజలు అల్లాడిపోతుంటే మంత్రి అప్పలరాజు పనితీరు ఏ స్థితిలో ఉందో అర్థమవుతోందని ఎద్దేవాచేశారు. రూ.700 కోట్లతో ఇంటింటికి తాగునీరు సరఫరా చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారే తప్ప ఎక్కడా చుక్కనీరు ఇచ్చే పరిస్థితులు లేవన్నారు. నియోజకవర్గంలో కొండల్ని సైతం దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే పలాస నియోజకవర్గం పరిధిలో సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా మాట్లాడుతూ అప్పలరాజు మంత్రి పదవి చేపట్టాక అభివృద్ధి కన్నా సొంత ఆస్తులు పెంచుకున్నారని విమర్శించారు. అభివద్ధి చేశామని చెప్పుకుంటూ చుట్టూ తిప్పి కిడ్నీ ఆసుపత్రి ప్రారంభించారని, అందులో పూర్తిస్థాయిలో పరికరాలు, సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి క్రిష్ణారావు, బడ్డ నాగరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.దుర్గారావు, బిజెపి నాయకులు పాలవలస వైకుంఠ రావు పాల్గొన్నారు.

రైల్వే కాలిబాట వంతెన ప్రారంభం

పలాస-నర్సిపురం రైల్వే కాలిబాట వంతెనను బుధవారం ఎమ్‌పి రామ్మోహన్ నాయుడు.. గౌతు శిరీషతో కలిసి ప్రారంభించారు. దీంతో నర్సిపురం గ్రామస్తులు రామ్మోహన్ నాయుడు, శిరీషను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్‌పి మాట్లాడుతూ కాలిబాట వంతెనను మూసేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతోందని శిరీషా చెప్పిన వెంటనే రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్కువ సమయంలో తెరిపించామని వివరించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి కేంద్రీకరించి, వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలతో ఎస్‌పి నెల వారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన (గ్రేవ్) కేసులలో నిశితమైన సాక్షి ఆధారాలతో, సమగ్రమైన దర్యాప్తుతో పురోగతి సాధించాలని సూచించారు. పెండింగ్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేసి ఛార్జిషీట్ కోర్టులో దాఖలు చేయాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో వాస్తవాలు పరిశీలించి, న్యాయపరంగా ఉన్న కేసుల్లో దర్యాప్తు చేసి, పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని తెలిపారు. కుల ధృవీకరణ పత్రాలు వీలైనంత మేరకు తీసుకొని ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. అత్యాచార, పోక్సో కేసులలో దర్యాప్తు నిర్ణీత 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి ప్రేమ్ కాజల్, డిఎస్‌పిలు డి.బాలచంద్రరెడ్డి, జి.నాగేశ్వరరెడ్డి, వై.శ్రుతి, బి.విజయకుమార్, తిరుమలరావు, ఆర్.శ్రీనివాస్ రావు, ట్రెయినీ డిఎస్‌పి సిహెచ్.రాజ, తదితరులు పాల్గొన్నారు.

బెంతుఒరియాలను ఎస్‌టిలో చేర్చొద్దు


పాదయాత్ర చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో నిజమైన బెంతుఒరియాలు లేరని, నకిలీ బెంతుఒరియాలు, బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చరాదని జిల్లా జెఎసి అధ్యక్షులు సవర రాంబాబు, ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలపై కంచిలి నుంచి పలాస వరకు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ మేరకు ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో బెంతు ఒరియాలుగా చెప్పుకుంటున్న వడ్డీలు బిసిలకు చెందిన వారని అన్నారు. గిరిజన సాంస్కృతిక శిక్షణ సంస్థ అధ్యాయనం ప్రకారం 1961 జనాభా లెక్కల్లో సీతంపేట ఐటిడిఎ పిఒ ఇచ్చిన నివేదికలో బెంతుఒరియాలు 271 మంది ఉండేవారని అన్నారు. 1979లో జిల్లా నుంచి విజయనగరం జిల్లా ఏర్పడిన తరువాత బెంతుఒరియాలు నివసించే గ్రామాలు విజయనగరంలో కలిశాయని అన్నారు. పస్తుతం జిల్లాలో నిజమైన బెంతుఒరియాలు లేరని అన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల సంఘాలు జిఒ 52ను రద్దు చేయాలని ఉద్యమాలు చేస్తున్నా... కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ర తరగతులను గిరిజన జాబితాలో చేర్చే ప్రయత్నం ఆపకపోతే తీవ్ర పరిమాణాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో వరహాల కృష్ణారావు, సవర కుమార్, సవర జగన్, పి.ఈశ్వరరావు, పూరేంద్ర, ఎస్.గణేష్ పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేశాం

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు


గార : నమూనా చెక్కును అందజేస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి- గార

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ సిఎం జగన్ అమలు చేశారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో వైఎస్ఆర్ చేయూత నమూనా చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవ్వరి దగ్గర తలవంచకుండా పథకాలు అందుతున్నాయని అన్నారు. దేశంలోనే ఆంధ్రా ఆదర్శంగా ఉందన్నారు. మండలంలో 45-60 మధ్య వయసు ఉన్న 6661 మందికి ఒక్కొక్కరికి రూ. 18,750 జమ చేస్తున్నామని అన్నారు. మాజీ సిఎం చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టలేక, అమలు చేయక మహిళా సంఘాలను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మహిళామణులకు సామాజిక గౌరవం భద్రత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి ఎంపీ అభ్యర్థి పి.తిలక్ అన్నారు. టెక్కలి జూనియర్ కళాశాల మైదానంలో వైఎస్ఆర్ చేయూత 4వ విడత సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు, గణపతి, వైస్ ఎంపిపిలు పేడాడ రమేష్ మన్నెల కిషోర్, మండల పార్టీ అధ్యక్షులు బగాది హరి, ఎంపిటిసిలు కూన పార్వతి, పీత హేమలత, వాకాడ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్‌లు గొండెలి సుజాత, బగాది రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య


ఊర్వశి మృతదేహం

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెంకు చెందిన కర్రి ఊర్వశి (19) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ కె.రాము అందించిన సమాచారం మేరకు ఊర్వశి అదే గ్రామానికి చెందిన బైపిల్లి శ్యామ్ కుమార్ అనే యువకుడితో సహజీవనం చేస్తోంది. బుధవారం ఉదయం శ్యామ్ కుమార్ నివాసంలోనే ఊర్వశి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఊర్వశి తల్లి కర్రి పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

మహిళలకు పెద్దపీట

పలాస: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హయాంలో మహిళలకు పెద్ద పీట వేశారని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. స్తానిక టిడిపి కార్యాలయంలో బుధవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ప్రతి మహిళకూ రూ.15 వేలు ఇవ్వనున్నారని తెలిపారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు పుచ్చ శోభారాణి, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కౌన్సిలర్లు జోగ త్రివేణి, తంగుడు ఆశారాణి, సప్ప అమ్మోజీ, డొక్కారి తులసి, మాధవి, ఢిల్లేశ్వరి, కలమ్మ, లావణ్య, వినీల పాల్గొన్నారు.


నమూనా చెక్కుతోపాటు కిట్లు అందజేస్తున్న కలెక్టర్

158 మందికి రూ.1.01 కోట్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పిఎం సూరజ్ పథకం కింద ఎస్‌సి, ఒబిసి, సఫారీ కర్మచారీ కార్మికులకు శ్రీనిధి, ఆయుస్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, పిపిఇ కిట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 158 మంది లబ్ధిదారులకు శ్రీనిధి కింద రూ.1.01 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. అలాగే 31 మందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పిపిఇ కిట్లు పంపిణీ చేశారు. ప్రధాని ఢిల్లీ నుంచి వర్చువల్ ద్వారా పిఎం సూరజ్ రుణాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి విశ్వమోహన్‌రెడ్డి, ఎల్‌డిఎం సూర్యకిరణ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు, శ్రీశయన కార్పొరేషన్ డైరెక్టర్ డి.బి.దేవ్ పాల్గొన్నారు.

ఎంపీ రామ్మోహన్ నాయుడు పర్యటన

ప్రజాశక్తి-నందిగాం

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రామాలు అభివృద్ధి టిడిపి కీలక భూమిక పోషించిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని దిమ్మిడిజ్వాల, రాంపురం గ్రామాల్లో పర్యటించారు. సవరంరాంపురంలో కల్వర్టు, డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కాపుతంపుర్‌లో కుమ్మర వీధిలో రూ.పది లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, సలాన కృష్ణారావు, కొల్లి హరిబాబు, కుజ్జు తాతయ్య, సబ్బి జానకిరావు, మండపాల మోహనరావు, పి.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా ఛార్జిషీట్లు దాఖలు చేయాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా


మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వివిధ కేసుల్లో నిందితులుగా జైలులో ఉన్న కేసులకు సంబంధించి పోలీసులు త్వరితగతిన ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. జైల్లో ఉన్న ముద్దాయిల విషయంలో పోలీసులు అలసత్వం ప్రదర్శించ వద్దని, ప్రతి కేసునూ పరిశీలించిన తర్వాతే ఛార్జ్‌షీట్ ఫైల్ చేయాలని సూచించారు. పోలీస్ అధికారులు ఈ నెల 16న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేయడానికి కృషి చేయాలన్నారు. రాజీపడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, మహేంద్ర, ఫణికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు నూన సత్యరాజులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మభ్య పెట్టేందు టిడిపి నాయకులు అన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకొని వస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా, రామకృష్ణ, జెఎస్‌సి కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీర్లకు మంచి భవిష్యత్

ఎచ్చెర్ల : సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ట్రిపుల్ ఐటిలో జెఎన్‌టియు జాతీయస్థాయి టెక్నికల్ సింఫోజియమ్ ప్రతిష్ట-24లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటువంటి సింఫోజియమ్ ప్రతిష్ట టెక్నికల్ సింఫోజియమ్ హాజరు వల్ల విద్యార్థుల్లో మేనేజ్‌మెంట్ స్కిల్స్ పెరుగుతాయన్నారు. మనకి ఉన్న విజ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకోవడం వల్ల మరింత విజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం, భవిష్యత్ కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య, సివిల్ ఇంజినీరింగ్ విభాగపతి శ్రీనివాసప్రసాద్, బాల మురళీకృష్ణ, ఫణీంద్రనాథ్, లతీష్‌కుమార్, కుమారి, తిరుమలదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె.వి.జి.ధన బాలాజీ

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

తెలుగుదేశం పార్టీ అధికారం లోనికి వచ్చిన వెంటనే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యాన పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని లక్ష్మీనగర్, రెడ్డి క్వార్టర్స్, చంద్రయ్యపేట గ్రామాల్లో బుధవారం శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, తమ్మినేని విద్యాసాగర్, కూన అప్పలనాయుడు, బోర గోవిందరావు, బోనెల అప్పారావు, బోయిన సునీత, లంక నాగరాజు, గురయ్య, నాగళ్ల మురళి, తాడేల రాజారావు పాల్గొన్నారు.

బూర్జ: సాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసిపి సర్కారేనని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారం మండలంలోని ఓవిపేట గ్రామంలో సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో భాగంగా టిడిపి- జనసేన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన ఆరు హామీలపై ప్రచారం చేశారు. ఈ నాయకులు ఎం.రమేష్, గోపి మాస్టర్, కోడి గోవింద, టిడిపి మండల అధ్యక్షుడు రాంజీ, తెలుగు యువత మండల అధ్యక్షులు లంక జగన్నాథం, తెలంగి రమణ, ముడుమూరు మురళి, ఎం.వెంకటకృష్ణారావు, కిల్లి సుధ పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని తిర్లంగిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. హనుమంతు రామకృష్ణ, రాము, పోలాకి షణ్ముఖరావు, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, చంద్రరావు,లవకుమార్,మధు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామకృష్ణ

పెద్దపేట సచివాలయం ప్రారంభం

బూర్జ: మండలంలోని పెద్దపేటలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సర్పంచ్ ఆనెపు వరలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రవికుమార్

టిడిపిలో చేరికలు

పొందూరు: మండలంలోని కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సేవా సంఘానికి చెందిన 30 కుటుంబాలు మంగళవారం రాత్రి టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలోకి చేరారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో టిడిపి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, ఎంపిటిసి మాజీ దండా రవి, కృష్ణాపురం సర్పంచ్ ప్రతినిధి అంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పలాస : 1998, 2008 డిఎస్‌సిల ద్వారా టైమేస్కేల్ (ఎంటిఎస్) ద్వారా నియమించిన ఉపాధ్యాయుల సర్వీసును క్రమబద్ధీకరించాలని జిల్లా ఉపాధ్యాయుల సంఘం మాజీ అధ్యక్షులు, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ జి.మధుసూదనరావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయల మాదిరిగా ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. 1998 డిఎస్‌సి ద్వారా ఎంపికైన ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఇప్పటికే చాలా సర్వీసును నష్టపోయారని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలో కొంతమందికి ఉద్యోగ విరమణ వయసు సమీపిస్తుందని అన్నారు. అందుకు సర్వీసులను రెగ్యులర్ చేయాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

లావేరు : మండలంలోని గుమ్మాడం పంచాయతీ వేణుగోపాలపురం దళితవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సర్పంచ్ భార్గవి, ప్రతినిధి దుర్గశి ధర్మారావు దంపతులు బుధవారం శంకుస్థాపన చేశారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో దుర్గశి వరలక్ష్మి, జగ్గారోతు తవిటినాయుడు, గంధవరపు పైడియ్య, దళిత నాయకులు రేగిడి ఇల్లయ్య, కృష్ణ, కొర్రాయి సూరిరాములు, లండ సూరిరాములు, ఎల్లయ్య, రాముడు, గొర్లె దుర్గారావు, నాగరాజు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమం

మెళియాపుట్టి : గడప గడపకు సంక్షేమ పథకాలే ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు ఓంశ్రీకృష్ణ అన్నారు. మెళియాపుట్టిలో బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పోస్టరల్నుఉ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, మాజీ ఎంపిపి ఎం.రామారావు, కరణం శశిభూషణరావు, పోలాకి జైమునిరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని నారాయణవలస పంచాయతీలో ఎంపిపి రోణంకి ఉమామహేశ్వర రావు, సర్పంచ్ గొద్దు చిరంజీవి, రైతు భరోసా జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యులు కవిటి రామరాజు, మండల జెఎస్‌సి కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు.

ఆకట్టుకున్న 'కాశీవాసి రావయ్య'

కవిటి: మన సంస్కృతీ, సాంప్రదాయాలను తుంగలో తొక్కి, మానవీయ సంబంధాలను ఆర్థిక సంబంధాలుగా మార్చి, వృద్ధులను భారంగా భావించి, వృద్ధాశ్రమాలు, అనాథశ్రమాల్లో చర్పించే అంశాన్ని ఇతి వృత్తంగా తీసుకుని ప్రదర్శించిన కాశీవాసి.. రావయ్య నాటిక ఆహూతులను అలరించింది. బెజ్జిపుట్టుగలో జరుగుతున్న శ్రీచక్ర పెరుమాళ్ స్వామి డోలోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కాశీవాసి రావయ్యా నాటిక ప్రదర్శించారు. పి.టి.మాధవ్ రచించిన ఈ నాటిక కవి ప్రసాద్ దర్శకత్వంలో శ్రీకలాభినయ బృందం ప్రదర్శించింది. తన తండ్రి అంత్యక్రియలు ఎవరో ఒక అనామకుడు చేశాడన్న వార్తతో కొడుకు పడే మనోవేదనకు ఈ నాటిక దృశ్య కావ్యంగా నిలిచింది.

నువ్వు పంటపై అవగాహన

పోలాకి : రైతులకు రబీ పంటలపై, నూనె గింజల పంటలపై అవగాహన ఉండాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన పరిశోధన శాస్త్రవేత్త ఎ.భాగ్యలక్ష్మి, యలమంచిలి ప్రధాన శాస్త్రవేత్త ఎ.అప్పలస్వామి అన్నారు. మండలంలోని కుసుమపోలవలస, గొల్లలవలస నువ్వు పంట పొలాలను బుధవారం పరిశీలించారు. నువ్వు పంటపై సామూహిక ప్రదర్శన క్షేత్రాలపై పొలాలను సందర్శించి సలహాలు సూచనలు ఇచ్చారు. నువ్వులో మెట్ట పరిస్థితిని తట్టుకోవడానికి 19.19.19 ఎకరాకు కేజీ చొప్పున పిరియారీ చేయాలన్నారు. నువ్వులు సమగ్ర యాజమాన్యం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నీలవేణి, విస్తరణ శాస్త్రవేత్త, ఎడిఎ రవీనద్రా భారతి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది వెంకటేష్, రైతులు చంద్రశేఖర్, వెంకటరావు, త్రినాథ, గోవింద, కె.పి.వలస అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం

బూర్జ: కత్తిరి పురుగుపై మొక్కజొన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ఎడిఎ సిహెచ్.వెంకటరావు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో అముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం అధ్వర్యాన మొక్కజొన్న రైతులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని ఉవ్వపేట, వావాం, నీలాపురం గ్రామాల్లో అధికంగా మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ చిట్టిబాబు, ఎడిఎ బి.రాజగోపాలరావు, ఎఒ వి.రాజేశ్వరరావు, విఎఎలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

టెక్కలి : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లు, బూత్‌ల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి పోలీసులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ల వారీగా రౌడీషీటర్లను గుర్తించి వారిపై నిఘా పెట్టాలన్నారు. గ్రామాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. శాంతిభద్రతలు కాపాడడంలో ఎటువంటి సందేహాలకు తావివ్వద్దని కోరారు. కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఇచ్ఛాపురం : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అంగన్వాడీ కార్యకర్త బి.నరసమ్మ అన్నారు. మండలంలోని మండపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కె.జ్యోతి, కె.సునీత, లలిత పాల్గొన్నారు.


సంతబొమ్మాళి : నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కొన్నా వీధిలో ఉన్న ఎంపిఆర్ న్యాయ కళాశాలలో బుధవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాల్ మోషీ పాల్గొని మాట్లాడారు. మొదటి ఏడాదిలో చేరిన న్యాయ విద్యార్థులకు స్వాగతం పలకడంతో పాటు మిగిలిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. గురువులు చెప్పే సలహాలను, సూచనలను పాటిస్తే న్యాయ రంగంలో సానుకూల ప్రభావాన్ని చూపగలరన్నారు. వృత్తిలో రాణించడం ద్వారా కళాశాలకు, తల్లితండ్రులకు కీర్తి ప్రతిష్టతలు తీసుకురావాలన్నారు. ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పరిపాలన విభాగాధిపతి డి.రమేష్, సీనియర్ అసిస్టెంట్ డి.నాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం కెడబ్ల్యు పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం బి.రామారావు పరీక్షా సామగ్రిని అందజేశారు. అనంతరం విద్యార్థులు సినిమా పాటకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో రామచంద్ర బెహరా, మురా బెహరా, ఎస్ఎంఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ఉన్నత చదువులు తొలి సోపానమైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం ద్వారా జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అన్నారు. పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొలుత పరీక్షా సామగ్రిని అందజేశారు. అనంతరం విద్యార్థులు సినిమా పాటకు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, బాడాన రాజు, ఉమాదేవి, కె.రమణమ్మ, విజయలక్ష్మి, నాగమణి, జగదాంబ, రజని, శ్రీనివాసరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో మున్సిపాలిటీ


శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు


పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు చిన్నబాడాంలో రూ.పది లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు, 18వ వార్డులో రూ.ఆరు లక్షలతో నిర్మించనున్న సిసి కాలువ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ పాలకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేశానని అన్నారు. దశల వారిగా అన్ని వార్డుల్లో సిసి రోడ్లు, కాలువలు నిర్మించామని చెప్పారు. కెటి రోడ్డు రూ.ఆరు కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపట్టి సుందరంగా తయారు చేయడంలో ఇతర పట్టణాలకు చెందిన వ్యాపారులు పలాస-కాశీబుగ్గలో పలు షోరూంలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల మున్సిపాలిటీ ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నాగేంద్రబాబు, కౌన్సిలర్లు సనపల సింహాచలం, శిషు గోపి, దువ్వాడ రమనమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బూత్ కమిటీలే కీలకం

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీలు క్రియాశీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. మండలంలోని పల్లిపేట రోడ్డున ఉన్న ఎస్ఎల్‌విడి కళ్యాణ మండపంలో బుధవారం మేము సిద్ధం - మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏమరుపాటు వద్దని అన్నారు. ప్రతి ఓటూ వైసిపికి పడేటట్టు కృషి చేయాలన్నారు. పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఎంపిఇపలు ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, జెడ్‌పిటిసి రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, మండల పార్టీ అధ్యక్షులు లుకలాపు రవి పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన

పలాస : గ్లకోమా వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పలాస కమ్యూనిటీ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ ఎ.మేఘన, డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు నేత్రాధికారి రోణంకి వెంకటరమణ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసనగర్ సచివాలయంలో గ్లకోమా వ్యాధిపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా నేత్ర పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటిలో ఇంట్రాక్యూలర్ ప్రెసర్ అంటే నరాలు వత్తిడి పెరిగి నరాలు దెబ్బతినే క్రమంలో చూపు కోల్పోయే ప్రమాదాన్నే నీటి కాసులు జబ్బు అంటారన్నారు. 40 ఏళ్లు ధాటిన వారికి ఈ వ్యాధి వస్తుందని, అందుకోసం ముందుగా పరీక్షలు చేసుకోవాలని అన్నారు. అవసరమైన వారికి మందులు, శస్త్రచికిత్సల ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చన్నారు. కుటుంబ సభ్యులకు ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే తప్పని సరిగా ఈ పరీక్షలు చేయించుకో వాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌సి గైనకాలజిస్టు డాక్టర్ ఎ.సునీల, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ శ్యామ్‌కుమార్, సచివాలయం సిబ్బంది. ఎఎన్ఎంలు, ఆశావర్కరు, వాలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ముచ్చటగా మూడోసారి వేలం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలో వివిధ రకాల ఆశీలు వసూలు చేసుకునేందుకు వేలం పాట మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించారు. మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉండే రైతు బజార్, వీధిగుత్తా, కమేళకు ఇప్పటి వరకు రెండూ దఫాలు వేలం పాటలు నిర్వహించారు. కౌన్సెల్ సభ్యులు బచ్చు జగన్, చిడిపోతు జగన్, ప్రేమకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండో దఫా వేలం పాటలో రూ.14 వేలు పెరగడంతో మళ్లీ వాయిదా వేశారు. దీంతో మూడోసారి వేలం పాట నిర్వహించి ఎజెండా అంశాలను ఆమోదం తెలిపారు. కమిషనర్ రమేష్, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు


అభినందిస్తున్న పద్మజ

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక రవీంద్రభారతి పాఠశాల్లో ఆరో తరగతి చదువుతున్న దినకర్ తేజ ఒలింపియాడ్ పోటీల్లో పాల్గోని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మజ బుధవారం అభినందించారు. సి.వి.రామన్ ఓలింపియాడ్ పోటీల్లో పాల్గొన్న దినకర్ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం పొందడంపై పాఠశాల ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ అభినందించారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు


కలెక్టర్‌ను కలిసిన శ్రీనివాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని సహకార సంఘాల నిర్వహణ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ప్రస్తుతం 36 సహకార సంఘాలు ఉన్నాయని, అందులో 27 సంఘాలు నష్టాల్లో నడుస్తున్నాయని అన్నారు. వాటిని బలోపేతం చేయాల్సి ఉందని కలెక్టర్‌కు వివరించారు. ప్రధానంగా సహకార సంఘాల కంప్యూటరీకరణ జరగాల్సి ఉందని, రైతులకు అందుతున్న సేవల్లో లోపాలను సరిదిద్దే ప్రక్రియ చేపట్టాల్సి ఉందని అన్నారు. ఈయతో ఆపటు డిసిఒ సుబ్బారావు ఉన్నారు.


ప్రారంభిస్తున్న గొండు శంకర్

అదనపు తరగతి గదులు ప్రారంభం

శ్రీకాకుళం రూరల్: పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పనలలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని, టిడిపి అధికారంలోకి వస్తే విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు, టిడిపి నాయకులు గొండు శంకర్ అన్నారు. మండలంలోని సింగపురంని కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలలో రెండు తరగతి అదనపు గదులను, రేపు షెడ్లను సొంత డబ్బులతో నిర్మించిన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగం బాగుండాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తన దృష్టికి తీసుకురావడంతో నిర్మించామని అన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వైద్యుల ఫిర్యాదు

పొందూరు: పొందూరు సామాజిక ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రామదాసు, జూనియర్ అసిస్టెంట్ ఎం.అనూషలపై వైద్యాధికారులు సుజాత, ప్రియాంక, ప్రతిభలు వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనను విడుదల చేశారు. సూపరింటెండెంట్ రామదాసు ఉదయం 10 గంటలకు ఆస్పత్రికి వచ్చి హాజరు వేసుకుని తిరిగి వెళ్లిపోతున్నారని, జూనియర్ అసిస్టెంట్ సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయని ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌డిఎస్‌లో నిధులు ఉన్నప్పటికీ తాము కోరిన ఓటీ పరికకరాలు, సిజర్స్ కొనకుండా వారికి నచ్చినవి కొనుగోలు చేస్తున్నారని, దీంతో తాము సిజేరియన్‌లు చేయడానికి ఇబ్బంది పడుతున్నామని గైనిక్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలంటూ డిసిహెచ్ఎస్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు : మండలంలోని లోలుగు కెజిబివిలో ఆరో తరగతి, ఇంటర్ బైసిపి మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడిబయట చిన్నారులు, దారిద్ర్య రేఖకు దిగువన గల బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అలాగే 7,8,9వ తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులు ఏప్రిల్ 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారిని కేటగిరీల వారీగా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.